క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం

కలసపాడు : కలసపాడు గ్రామ సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సర్పంచ్ శివలీల, రమణయ్య స్వామి ప్రారంభించారు. నంద్యాల శాంతిరాం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు కేఎస్ఎన్ స్వామి, రామస్వామి నాయక్ 90 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 50 మందికి ఆపరేషన్లు చేయాల్సి ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాంబాబు, పంచాయతీ సెక్రటరీ సృజన పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

పోరుమామిళ్ల: మండలంలోని గురప్పగారిపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం వాసవీక్లబ్ దుబాయ్ గవర్నర్ నూకల మురళీకృష్ణ ఆర్థిక సహాయంతో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మోటపోతుల శివకుమార్, గంగిశెట్టి పవన్‌కుమార్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, సుబ్రమణ్యం, జాయింట్ సెక్రటరి శివరామకృష్ణ పాల్గొన్నారు.

అధికారుల సూచనలను పాటించాలి

కాశినాయన : రైతులు వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని వ్యవసాయాధికారి చంద్రమోహన్, ఏఈఓ రవి తెలిపారు. మంగళవారం మండలంలోని చెన్నవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన వరి, పత్తి, మినుము పంటల యాజమాన్యం, సస్య రక్షణ చర్యల గురించి రతులకు వివరించారు. వరి నాటే సమయంలో నారు కొనలను తుంచి నాటడం వలన ఆకు చివరిలో ఉన్న తెగులు, పురుగు గుడ్లను నిర్మూలించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు పావని, నీలవేణి రైతులు పాల్గొన్నారు.


ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి

దువ్వూరు : విధి నిర్వహణలో భాగంగా ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణమని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణయ్య తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయంలో పనిచేస్తూ బదిలీ అయిన ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం ఉద్యోగుల బదిలీలు జరుగుతుంటాయని, ఉద్యోగులు ఎక్కడ పనిచేసినా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి ప్రజల మన్ననలను పొందాలన్నారు. ఇక్కడ పనిచేసి బదిలీపై వెళుతున్న ఉద్యోగులు వారి విధులు చక్కగా నిర్వహించారని, ప్రజల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశారన్నారు. బదిలీ అయిన 8 మంది సచివాలయ ఉద్యోగులకు శాలువా కప్పి పూలమాల వేసి, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ హరికృష్ణ, ఏఓ వీరారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

చాపాడు : వరి సాగు చేసే రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత పేర్కొన్నారు. మండలంలోని టీఓపల్లె, రేపల్లె గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాలలో వ్యవసాయాధికారి రైతులతో సమావేశమయ్యారు. వరి సాగు చేసుకునే రైతులు పంట సాగుకు ముందే వ్యవసాయ సిబ్బంది సంప్రదించి వారి మెలకువలు, సూచనలు పాటించాలన్నారు. పంట సాగు చేసి ప్రతి రైతు తమ పంటను వ్యవసాయ సిబ్బందిచే నమోదు చేయించుకోవాలన్నారు. ఎలాంటి పంట సాగు చేసినా ఆన్‌లైన్ కేంద్రాలలో బీమా నమోదు చేయించుకోవాలని, దీని వలన విపత్తుల సమయంలో పంట నష్ట పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో టీఓపల్లె ఉప సర్పంచ్ నాగేశ్వరరెడ్డి, ఏఈఓ స్వప్న వీఏఏలు చిట్టిబాబు, బేబి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించే ఆటోడ్రైవర్లపై కఠినచర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం నిబంధనలు పాటించని, పీసీ నెంబర్లు లేని ఆటోలను స్టేషన్‌కు తరలించి ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని, ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. డ్రైవర్ సీటు పక్కన అదనపు సీట్లు ఏర్పాటు చేసినా, ఆటోలో సౌండ్ సిస్టం ఏర్పాటు చేసినా సంబంధిత ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా లైసెన్స్ లేని డ్రైవర్లు ఉంటే లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలని, వారికి పోలీసుశాఖ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని కోరారు. ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు సహకరించాలని కోరారు. రాత్రి వేళల్లో ఆటోలు నడిపే డ్రైవర్లు అపరిచిత వ్యక్తుల సమాచారం పోలీసులకు ఇవ్వాలన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపుపై నిరసన



విద్యుత్ కార్యాలయం వద్ద స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద మంగళవారం స్మార్ట్ మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇది విద్యుత్ రంగ్యాన్ని పూర్తిగా ప్రైవేటీకరించడానికి చేస్తున్న కుట్ర అన్నారు. గతంలో స్మార్ట్ మీటర్లను, గత ప్రభుత్వం అదానితో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని టీడీపీ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. కోర్టుకు కూడా వెళ్లిందన్నారు. అవన్నీ మరిచి అధికారంలోకి వచ్చాక అదానితో చేసుకున్న ఒప్పందాన్ని కొనసాగించడమేకాకుండా స్మార్ట్ మీటర్ల బిగింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ప్రస్తుతం పోస్టు పేయిడ్ విధానం వల్ల బిల్లులు చెల్లించడానికి కొంత సమయం ఉందని, స్మార్ట్ మీటర్లు బిగిస్తే ఆ సమయం ఉండదన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల సామన్య ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సమితి సభ్యులు డి.శివారెడ్డి, జి.రామకృష్ణ, నరసింహా, హరి, ప్రమీల, సుజాత, శ్రీనివాసులరెడ్డి, మద్దిలేటి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



మైదుకూరు విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు

మైదుకూరు : స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ట్రాన్స్‌కో డీఈ జి.శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారంటూ కూటమి నేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు విమర్శించి వారు అధికారంలోకి రాగానే ఇప్పుడు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుండటం శోచనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసే స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని కూటమి నేతలు పిలుపునిచ్చిన విషయం గుర్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శ్రీరాములు, నియోజకవర్గ కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, ఎస్‌సీ సంక్షేమ సంఘం నాయకుడు విలియం, మాల మహానాడు నాయకులు యు.కుమార్, టి.చిట్టిబాబు, ఎమ్మార్పీఎస్ నాయకుడు కె.భాస్కర్, ఎం.కనకరాజు, నీలాపురం సుధాకర్, సీపీఐ పట్టణ కార్యదర్శి డి.సుబ్బరాయుడు, దువ్వూరు మండల కన్వీనర్ జి.రవి, ఖాజీపేట మండల నాయకుడు జి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే మానుకోవాలని సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు కోరారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ పట్టణంలోని వార్డు సచివాలయాల వద్ద వారు ఆందోళన చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు
రద్దు చేయకుంటే మరో ఉద్యమం



బద్వేలు అర్బన్ : ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : స్మార్ట్ మీటర్లు రద్దు చేయకుంటే మరో ఉద్యమం చేపడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వీరశేఖర్, సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు చంద్రమోహన్‌రాజు పేర్కొన్నారు. అదానీ స్మార్ట్‌మీటర్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు శఠగోపం పెట్టనున్నాయని స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మంగళవారం వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డులోని విద్యుత్‌శాఖ ఏడీఈ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని నాటి పాలక ప్రతిపక్ష కూటములైన యూపీఏ, ఎన్డీయే ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణల పేరిట ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తూ పార్లమెంటులో చట్టం చేశారని, అందులో భాగంగానే అంబానీ, అదానీ లాంటి ఏడు కార్పొరేట్ సంస్థలకు విద్యుత్ సంస్థలను ధారాదత్తం చేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రెండు కోట్ల విద్యుత్ కనెక్షన్లను అదానీ సంస్థకు అప్పగించి యూనిట్ విద్యుత్ ఛార్జీ రూ.7లకు విక్రయించడానికి 25 సంవత్సరాలు అగ్రిమెంట్ చేసుకున్నారని, దీని వలన సంవత్సరానికి 76 వేల కోట్ల రూపాయలు అదనపు భారం ప్రజలపై పడుతుందని అన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శివకుమార్, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, కెవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.జకరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

పోరుమామిళ్ల : స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ట్రూఅప్ చార్జీలను తగ్గించాలని సీపీఐ, సీపీఎం, అఖిలపక్ష నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం పోరుమామిల్లలో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, మెడకు విద్యుత్ వైర్లు బిగించుకొని అంబేద్కర్ సర్కిల్ నుండి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. విద్యుతశాఖ ఏర్పాటు చేసిన మీటర్ల స్థానంలో ఆదానీ స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏముందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం తగ్గించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మస్తాన్, రవికుమార్, కేశవ, సఫా, పీరయ్య, చాంద్‌బాషా, సీపీఎం నాయకుడు భైరవప్రసాద్, గౌసియాబేగం, కాంగ్రెస్ నాయకుడు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

సింగరాయపల్లెలో 'పొలం పిలుస్తోంది'



అట్లూరు : చెన్నంపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

కలసపాడు : మండలంలోని సింగరాయపల్లెలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలంలో పిలస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ పద్మజ, కేవీకే శాస్త్రవేత్త సునీల్ కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఈ-పంట నమోదు కార్యక్రమం ప్రారంభమైందని, ఇప్పటికే 350 ఎకరాలు నమోదు చేశామని పేర్కొన్నారు. పంట నమోదు చేయించుకోని రైతులకు అన్నదాత సుఖీభవ, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగి పంట నష్టపరిహారం, మద్దతు ధర లభించదని తెలిపారు. ట్రాక్టర్ పనిముట్లు, పట్టలు, స్ప్రేయర్లు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుంటే వచ్చిన వెంటనే వారికి అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది శ్రీనివాసులు, ఏఈఓ ధనలక్ష్మి, సుబ్రహ్మణ్యం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అట్లూరు : బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు మండలం చెన్నంపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.అరుణ బద్వేలు మండల రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ-పంట నమోదు కార్యక్రమం మొదలైందని, ఇప్పటికి 70 ఎకరాలు నమోదు చేయడం జరిగిందన్నారు.

మురుగు కాలువలు శుభ్రం చేసేందుకు చర్యలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణంలోని ప్రధానమైన ఐదు మురుగు కాలువలను శుభ్రం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన మంగళవారం సాయంత్రం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురుగు కాలువల్లో పూడికలు పేరుకుపోయిన కారణంగా మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో ఈ సమస్యను పరిశీలించామని, ఐదు కాలువలను శుభ్రం చేసేందుకు సుమారు రూ.8లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. జేసీబీతోపాటు సిబ్బందిని ఏర్పాటు చేసి కాలువల్లోని పూడికతను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తామన్నారు. పట్టణంలోని గోకుల్ నగర్, పైపుల ఫ్యాక్టరీ సందుతోపాటు అమ్మ హాస్టల్ తదితర ప్రాంతాల్లో అవసరమైన మేరకు రోడ్లు నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఇందుకు సుమారుగా రూ.7లక్షల మేరకు ఖర్చువుతుందని తెలిపారు. అవసరాన్ని బట్టి మళ్లీ నిధులు కేటాయిస్తామన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో 12 చోట్ల కొత్త మరుగుదొడ్లను నిర్మించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్ శ్రీనివాసులు, డీఈ రాజేష్ పాల్గొన్నారు.

కూటమి పాలనలో రైతులకు కష్టాలు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : కూటమి పాలనలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా.. ప్రభుత్వం రైతాంగ సమస్యలను పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మండిపడ్డారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైతుభరోసా ద్వారా ప్రతి ఏడాది రూ. 13,500 అందించి అన్నదాతకు అండగా నిలిచామని, కూటమి ప్రభుత్వం రెండేండ్లకు రూ. 40 వేలకు బదులు రూ. 5 వేలు ఇచ్చి, 7 లక్షల మంది రైతులకు అన్నదాతా సుఖీభవ వర్తింప చేయకుండా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రైవేటు దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు కొనాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కాంప్లెక్స్ ఎరువు రూ. 100 నుండి రూ. 255 పెరిగినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఆరుగాలం శ్రమించి, లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలకు గిట్టుబాట ధర లేక రోడ్లపై పారబోస్తున్నారని తెలిపారు. జూన్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 250 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో..

వైఎస్సార్‌సీపీ పాలనలో ఉచిత విద్యుత్, సున్నా వడ్డీ పంటరుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, గ్రామస్థాయిలో విత్తనాలు, ఎరువులు రైతులకు సరఫరా చేశారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జిల్లా రైతు విభాగ ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, మండల రైతు విభాగం అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు రాజీవ్ బాషా, మేధావుల ఫోరం ఎగ్జిక్యూటివ్ మెంబర్ రవిచంద్రారెడ్డి, కలసపాడు జెడ్పీటీసీ గురివిరెడ్డి, సీనియర్ నాయకులు పుల్లారెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలకాశి, ఏపీ విద్యుత్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 180 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పెన్నానగర్ ఏఐటీయూసీ కార్యాలయంలో ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలలో ఎన్ని గంటలు కార్మికులు పనిచేసినా ఉద్యోగ భద్రత లేదన్నారు. ఒప్పంద, పొరుగు సేవల కార్మికులకు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్180 యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర, హెచ్ 64 యూనియన్ నాయకులు సాంబశివారెడ్డి, రాము, హెచ్ 155 యూనియన్ నాయకులు విజయ్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, వి.గంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి



ప్రొద్దుటూరు : డీటీ సుదర్శన్‌కు వినతి పత్రం ఇస్తున్న పాత్రికేయులు



బద్వేలు అర్బన్ : ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రం ఇస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు



మైదుకూరు : డీటీ ప్రవీణ్‌కు వినతి పత్రం అందిస్తున్న జర్నలిస్టులు

బద్వేలు అర్బన్ : జర్నలిస్టుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మంగళవారం ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఉదయభారతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ నాయకులు భూమిరెడ్డివెంకటేష్, పి.సుదర్శన్‌రెడ్డి, జె.జానీసుందరం మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులందరికి కాలయాపన చేయకుండా తక్షణమే కొత్త అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఆవులకిశోర్, ఎ.వెంకటేష్, మోహన్‌క్రిష్ణ, అనిల్, రఘు, హుస్సేన్, ప్రసాద్, కిశోర్, రాజు, రవి, జి.రాజు, శేఖర్, నరసింహ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని వినతి

కలసపాడు : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టులు స్థానిక తహసీల్దార్ మధురవాణికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, ఇళ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. పాత అక్రిడేషన్ల గడువు ఇక పొడిగించకుండా పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ కొత్త అక్రిడేషన్లు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు నారాయణరెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఓ.రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రిడేషన్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలి

మైదుకూరు : జర్నలిస్టులకు అక్రిడేషన్లు, ఇంటి స్థలాలు వెంటనే ఇవ్వాలని మైదుకూరు మండలంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కోరారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు కరెడ్ల కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ ప్రవీణ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ అక్రిడేషన్లు లేకపోవడం వల్ల సదుపాయాలు కోల్పోతున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే సీనియర్ పాత్రికేయులు బొమ్మిశెట్టి మోహన్, తోట రామమోహన్, కొట్టే జయరామ్, భాస్కర్‌రెడ్డి, కొటిట్టి చంద్రమోహన్, శేగినేని మురళి, బండి చిన్నయ్య, వరకుమార్, యాపరాల ప్రసాద్, రంజిత్‌కుమార్, గోశెట్టి రవీంద్ర, చొక్కం ప్రసాద్, కొటిట ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

కాశినాయన : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని మండలంలోని ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ రవిశంకర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్లు జారీ చేయాలన్నారు. అక్రిడేషన్ కార్డులు లేని జర్నలిస్టులకు హెల్త్ కార్డు లేకుండాపోయిందని, అర్హులైన ప్రతి జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.

జర్నలిస్టుల సమస్యలపై వినతి

బ్రహ్మంగారిమఠం : వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం పలు రాయితీలు కల్పించాలని మంగళవారం ఏపీయూ డబ్ల్యూజే ఆధ్వర్యంలో బి.మఠం విలేకరులు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ కార్తీక్‌కు ఇచ్చారు ఇందులో ప్రధానంగా వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం కలిగిస్తున్న పథకాలు కూటమి ప్రభుత్వం తప్పకుండా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ పత్రికల జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో...

ప్రొద్దుటూరు : జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్‌కు జర్నలిస్టులు వినతి పత్రం అందించారు. కూటమి ప్రభుత్వం అక్రిడేషన్ల గడువును పొడిగించకుండా పనిచేస్తున్న వారందరికి కొత్త కార్డులను మంజూరు చేయాలని జర్నలిస్టులు కోరారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాలని తెలిపారు.

తల్లిపాలు శ్రేష్టమైనవి



ప్రొద్దుటూరు : తల్లిపాల అవగాహన ర్యాలీలో వైద్యులు, సిబ్బంది



కాశినాయన : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీనివాసనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ కాంత్ మాట్లాడుతూ తల్లిపాలు ఎంతో విశిష్టమైనవని, తల్లిపాలకు ప్రత్యామ్నాయంగా వేరే ఏమి లేవన్నారు. తల్లిపాలు శిశువుకు దేవుడు ఇచ్చిన వరమని, స్వచ్ఛమైనవని బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతాయన్నారు. డాక్టర్ మధు కుమార్ మాట్లాడుతూ తల్లిపాల వలన శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మపాలే బిడ్డకు అమృతం

కాశినాయన : తల్లి పాలు బిడ్డకు అమృతం వంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొండ్రాజుపల్లె గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు ఇవ్వాలన్నారు. తల్లిపాల వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీదేవి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ జి.రాజేష్‌కుమార్, డాక్టర్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన ఆశా సమావేశంలో ముందుగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు అమృతంతో సమానమని, పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టించడం ద్వారా ఎన్నో పోషకాలు అందడంతో పాటు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే తల్లికి కూడా గర్భసంచి, రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్‌ఓ చంద్రావతి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు అమృతం

దువ్వూరు : అప్పుడే బిడ్డకు ముర్రుపాలు అమృతమని ఐసీడీఎస్ చాపాడు ప్రాజెక్టు సూపర్‌వైజర్ వరలక్ష్మి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా దువ్వూరులోని 9వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లులకు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలను తాపించాలని సూచించారు. తల్లిపాల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయేషా, సుభద్ర, కవిత, రుహనాబీ, ఆయాలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

బి.కోడూరు : తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు. మంగళవారం బి.కోడూరు పీహెచ్‌సీలో ఆశాడే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుండి 8వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయని, 6 నెలలు వచ్చే వరకు బిడ్డకు తల్లిపాలు తాగించాలన్నారు.

చెక్కభజన కళాకారుడు
పుల్లయ్య మృతి



సగిలి పుల్లయ్య (ఫైల్)

కలసపాడు : మండలంలోని హృదయపేట గ్రామానికి చెందిన ప్రముఖ చెక్కభజన కళాకారుడు సగిలి పుల్లయ్య ఆకస్మికంగా మృతి చెందారు. ప్రొద్దుటూరు మండలం బొజ్జవారిపల్లెలో సోమవారం రాత్రి గజ్జ పూజ కార్యక్రమం నిర్వహిస్తూ అకస్మికంగా కుప్పకూలాడు. వెంటనే స్థానికులు ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పుల్లయ్య చిన్న నాటి నుండి చెక్క భజనలో ఆరితేరి తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర దేశాల్లో కూడా చెక్కభజన ప్రదర్శనలను ఇచ్చి ప్రఖ్యాతిగాంచారు. ఈయనకు హంసా అవార్డు, రాష్ట్రస్థాయి అవార్డులతోపాటు పలు సంస్థల వారు పురస్కారాలు అందించి సత్కరించారు. మంగళవారం పుల్లయ్య భౌతికకాయాన్ని మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు సగిలి ప్రసాద్‌రావు, వెంబడి ఈశ్వర్, సగిలి గురయ్య, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కొత్తపల్లె మనోహర్, పలువురు కళాకారులు సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. గ్రామంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

భజన పుల్లయ్యకు సంతాపం

ప్రొద్దుటూరు : ప్రముఖ చెక్క భజన కళాకారుడు, భజన పుల్లయ్య మృతి చెందడం బాధాకరమని విశ్రాంత తెలుగు పండితుడు డాక్టర్ మూలె రామమునిరెడ్డి మంగళవారం తెలిపారు.